క్లుప్తంగా

ఎన్నికల కోడ్‌ను పక్కగా అమలు చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ హనుమంతురావు

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను గ్రామాల్లో పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ హనుమంతురావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులతో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫిర్యాదులు వస్తే తక్షణం స్పందించాలన్నారు. ఎంపీడీఓ ఎస్.హరిహర రావు, డిప్యూటీ తహసీల్దార్ పి.హరి తదితరులు పాల్గొన్నారు.

జీడి, మామిడి తోటల పరిశీలన



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు, తదితరులు

బొండపల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం అందజేసిన సహాయంతో మండలంలోని జి.పి.అగ్రహారం గ్రామంలో పలువురు రైతులు సాగుచేస్తున్న జీడి, మామిడితోటలను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, ఉపాధి హామీ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉద్యానవనశాఖ ద్వారా అందజేసిన ప్రతీ మామిడి, జీడి మొక్కను రైతులు సంరక్షించాలని చెప్పారు. మొక్కలతో పాటు వాటి సంరక్షణకు ప్రభుత్వం నిధులు ఇస్తోందని తెలిపారు. జీడి, మామిడి తోటల సాగును ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఏపీఓ బి.కృష్ణవేణి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: మండలంలోని పెదమధుపాడకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్తలు బంక నారాయణరావు, సర్వసిద్ధ పాపారావు ఆపార్టీని వీడి సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విజయనగరంలోని తన నివాసంలో సోమవారం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై చాలా మంది పార్టీలో చేరుతున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, పెదమధుపాడ సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



పెణసాం గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని విజయనగరం డీఎస్పీ గోవిందరావు కోరారు. పెణసాం, కితుబర్తి గ్రామాల్లో సీఆర్పీఎఫ్ బలగాలు, పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్ఛ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనివేళల్లో మార్పులు

మెరకముడిదాం: ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి పని వేళల్లో ప్రభుత్వం మార్పులు చేసిందని ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్ర కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి 11గంటల వరకే ఉపాధి పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అలాగే చిన్న, సన్నకారు రైతులకు చెందిన జీడి, మామిడి ,కొబ్బరి,సపోటా తోటల్లో గట్లు ఎత్తడం,చెట్ల చుట్టూ చదును చేయడం వంటి పనులను ఉపాధి హామీ పథకంలో చేయించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు.రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు.

చంద్రబాబు మాయ మాటలు నమ్మొద్దు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



జాగరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,నాయకులు

జామి: ఎన్నికలు వచ్చినప్పుడే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి ప్రజలు గుర్తుకు వస్తారని, ఆయన మాయమాటలు, బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. మండలంలోని పావాడ, జాగరం, లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులుపట్టి, విజయ తిలకం దిద్దారు. ఈసందర్భంగా ప్రచారసభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని, పార్టీలకతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు మంజూరు చేశారని, అవినీతి రహిత పాలన అందించారని వివరించారు. సీఎం జగన్ నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు గ్రామాల్లోనే అందుతున్నాయని చెప్పారు. 2014లో చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, వాటిలో ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపిం చారు. ఈ ఐదేళ్లలో నిత్యం ప్రజల మధ్యే ఉన్నామని, నియోజకవర్గంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను వారికి పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుని, వాటిని పరిష్కరించామని చెప్పారు. పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగించారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, బెడ్‌పై ఉన్న రోగులకు వలంటీర్లు ప్రతి నెలా ఇంటి వద్దే పింఛన్లు అందించే వారని, చంద్రబాబు తన అనుచరులతో ఎన్ని కల కమిషన్ కు ఫిర్యాదు చేయించి వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. పేదలు బాగుంటే చూసి ఓర్వలేని తనం చంద్రబాబుది అని అన్నారు. సీఎం జగన్ పేదల కోసం పరితపించే వ్యక్తి అని, ఆయన్ని ఆశీర్వదించాలని కోరారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎస్.కోట ఎమ్మెల్యేగా తనను, విశాఖపట్నం ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, జేసీఎస్ కన్వీనర్ శిరెడ్డి చందునాయుడు, పావాడ మాజీ సర్పంచ్ అల్లు అనిత, జాగరం సర్పంచ్ వసి పార్వతి, ఎంపీటీసీ పాడిపిరెడ్డి నరసింహనాయుడు, లక్ష్మీపురం, చింతాడ సర్పంచ్‌లు రామలక్ష్మి, అప్పాన సుబ్రహ్మణ్యం, నాయకులు అల్లు అప్పలనాయుడు, శిరికి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పావాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

చేసిన మంచిని గడప గడపకూ వివరిద్దాం



ఎం.కొత్తవలసలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎంపీపీ చల్లాచలంనాయుడు పార్టీ శ్రేణులకు సూచించారు. మండలంలోని మరువాడ, ఎం.కొత్తవలస గ్రామాల్లో పార్టీ నాయకులు,కార్యకర్తలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీ ఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు.సచివాలయ వ్యవస్థ ద్వారా ప్ర భుత్వాన్ని ప్రజల ముంగిటకు తీసుకు వచ్చారని, కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా అ ర్హులందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య,ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ విజయానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇంటింట ప్రచారం చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి జరిగిన మేలును వివరించి, వారి మద్దతును కోరాలని చెప్పారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, నియోజకవర్గ, మండల జేసీఎస్ కన్వి నర్లు ఈదుబిల్లి కృష్ణ, పల్లి రఘు, నాయకులు దాస రి శివ ప్రసాద్, కర్రోతు మాధవ్, కోరాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



మరడాంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు

దత్తిరాజేరు: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, బయట తిరిగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు సూచించారు. మరడాం గ్రామంలో ప్రజలకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళ్లు తిరగడం, తిమ్మిర్లు, దద్దుర్లు, నీరసం, మైకం, తలనొప్పి, వికారం, చెమటలు, మూర్ఛ వంటివి వడదెబ్బ లక్షణాలు అని అన్నారు. దాహం వేయక పోయినా తరచూ నీరు తాగాలని, తేలికైన, లేత రంగు, వదులుగా ఉన్న దుస్తులు ధరించాలని చెప్పారు. బయటకు వెళ్లేటపుడు కళ్లజోడు, గొడుగు, టోపీ, చెప్పులు ధరించాలని, వెంట తాగునీరు ఖచ్చితంగా తీసుకెళ్లాలని సూచించారు. ఉపాధి వేతనదారులు ఉదయం 10 గంటల లోపు పనులు ముగించాలని చెప్పారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గొట్టుపల్లి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని, గ్రామాల్లో ఎవరైనా గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని గొట్టుపల్లి గ్రామంలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. గొడవలు పడి, కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



రాజీనామా పత్రాలను చూపిస్తున్న కొత్తవలస సచివాలయం-3 పరిధి వలంటీర్లు

కొత్తవలస: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తమను సేవల నుంచి దూరం చేశారని, వృద్ధులకు ఇళ్ల వద్ద పింఛన్ అందకుండా అడ్డుకున్నారని పలుగ్రామాల వలంటీర్లు మండిపడ్డా రు. మండలంలోని కంటకాపల్లి, దేవాడ, సంతపాలెం, నిమ్మలపాలెం, కాటకాపల్లి,కొత్తవలస,గనిశెట్టిపాలెం మంగళపాలెం సచివాలయాల పరిధిలోని 92 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను ఆయా సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

ఈనాడు పత్రిక ప్రతుల దహనం

తమ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా గత కొద్దిరోజులుగా ఈనాడు పత్రిక కథనాలను ప్రచురిస్తోందని వలంటీర్లు మండిప డ్డారు. దేవాడ సచివాలయం పరిధిలోని వలంటీర్లు ఈనాడు పత్రిక ప్రతులను తగలబెట్టారు. రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

గొంప.. మా కొంప ముంచేశారు..


- గొంపపై భగ్గుమన్న అనుచరవర్గం
- పార్టీ మారేందుకు సన్నద్ధం



ఎస్.కోట రెబల్ అభ్యర్థి గొంపను నిలదీస్తున్న కార్యకర్తలు, నాయకులు

శృంగవరపుకోట: నమ్మించావు.. వెనుక తిప్పుకున్నావు.. రెబల్‌గా పోటీచేస్తానని చెప్పావు.. తీరు ఇన్నాళ్లూ వ్యతిరేకించిన అభ్యర్థితో లాలూచీ పడి పోటీ నుంచి తప్పుకున్నావు.. ఈ మాత్రం దానికి నువ్వు రాజకీయం చేయడమెందుకు.. విలువలతో బతికిన మమ్మలను ఇప్పుడు రోడ్డున పడేశావు.. మా కొంప ముంచావంటూ ఎస్.కోట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొంప కృష్ణను ఆయన అనుచరవర్గం దుమ్మెత్తి పోసింది. స్థానిక గొంప కృష్ణ కార్యాలయంలోనే పార్టీ నాయకులు, కార్యకర్తలు నిలదీశారు. ఇన్నాళ్లూ గొంపతో పనిచేసిన వారిలో చాలామంది టీడీపీని వీడేందుకు సిద్ధపడుతున్నారు. స్వార్థ రాజకీయాలు చేసేవారితో ఉండకూడదన్న నిర్ణయానికి వచ్చారు. ఇంకా బలిపశువులు కారాదన్న ఉద్దేశాన్ని వ్యక్తంచేశారు.

ఘనంగా నూకాలమ్మ పండగ



శృంగవరపుకోట: కొత్త అమావాస్య సందర్భంగా పట్టణంలో నూకాలమ్మ పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. మునసబు వీధి వద్ద ఉన్న అమ్మవారి ఆల యంలో భక్తులు విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పిండివంటలు, పానకం, ఒడపప్పు నివేదన చేసి, పసుపు, కుంకుమ, చీర,గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూకాలమ్మ ఆలయంతో పాటూ పలు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.